నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ ఆదివారం 28 ఏప్రిల్ 2024 | ADILABAD NIRMAL

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి

భైంసా, ఏప్రిల్ 27 : లోక్‌సభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ రాజేంద్ర విజయన్ అన్నారు. శనివారం పట్టణంలోని కిసాన్ గల్లిలో గల శిశు మందిర్ పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈయన వెంట కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్, సీఐ రాజారెడ్డి ఉన్నారు.

జొన్న కొనుగోళ్ల తీరుపై రైతుల ఆగ్రహం

మాట్లాడుతున్న రైతులు

బోథ్, ఏప్రిల్ 27 : బోథ్ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్, సహకార సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న జొన్నల కొనుగోలు తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం దిగుబడి 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు వచ్చిందన్నారు. ప్రభుత్వం కేవలం ఎకరానికి 8.85 క్వింటాళ్లు మాత్రం కొనుగోలు చేయడం సరి కాదన్నారు. మిగిలిన జొన్నలను దళారులను అమ్ముకుని తాము తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఎకరానికి 13 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. కొనుగోలు తీరు మారకపోతే రైతులంతా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులతోపాటు బీజేపీ నాయకులు గొర్ల రాజుయాదవ్, అనిల్ అప్ప, ఆప్కా సంజీవ్, భీంరావ్, రవీందర్ రెడ్డి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

కాలనీలో గంజాయి ఫ్రీ పోస్టర్స్‌ను అతికిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

గంజాయికి దూరంగా ఉండాలి..

- ఎస్పీ జానకి షర్మిల

సోన్, ఏప్రిల్ 27 : 'గంజాయికి నో చెప్పండి' ఇది అందరిలో అవగాహన కలిగి ఉండి గాంజాకు దూరంగా ఉండాలని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల అన్నారు. నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శనివారం వేకువ జామున నిర్మల్ పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి మత్తుకు యువత దూరంగా ఉండాలని, అలవాటుపడితే జీవితాలు పాడైపోతాయని, ఇది ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన విషయమని సూచించారు. గంజాయి, గుట్కా, లిక్కర్‌పై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాన్ని నడుపాలని కోరారు. హెల్మెట్ ప్రతిరోజు ధరించే వారికి సన్మానం చేశారు. హెల్మెట్ కొనలేని పేదవారికి కొత్త హెల్మెట్లు అందించారు. కాలనీలో బెల్టుషాపులో విక్రయిస్తున్న 13 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేశారు. అనంతరం గంజా ఫ్రీ పోస్టర్స్‌ను కాలనీలో అతికించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ గంగారెడ్డి, నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, సర్కిల్ ఎస్సైలు చంద్రమోహన్, సుమాంజలి, హనుమాండ్లు, సాయికుమార్, ఆర్ఎస్సై రవి, రమేశ్ పాల్గొన్నారు.


కరపత్రం అందజేసి తనను గెలిపించాలని కోరుతున్న ఎంపీ అభ్యర్థి సక్కు

హామీలు అమలు చేయని కాంగ్రెస్

- ప్రజలను మరోసారి మోసం చేయడానికి సిద్ధంగా ఉంది..
- కారు గుర్తుపై ఓటు వేసి ఎంపీగా గెలిపించాలి..
- బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఎదులాపురం, ఏప్రిల్ 27 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేని స్థితిలో ఉందని, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను మరోసారి మోసం చేయడానికి ముందుకు వచ్చిందని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. ప్రచారంలో భాగంగానే శనివారం జిల్లా కేంద్రంలోని పలుకాలనీల్లో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక రిక్షాకాలనీలోని శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సక్కు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర హక్కుల రక్షణ కోసం కేంద్రంతో కొట్లాడిన బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు అలాల్ అజయ్, దాసరి రమేశ్, రాంకుమార్, భరత్‌కుమార్, పందిరి భూమన్న, సందనర్సింగ్, పర్వీన్ సుల్తానా, దమ్మపాల్ పాల్గొన్నారు.

జామినిలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేస్తాం..

బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి సక్కు

జైనథ్, ఏప్రిల్ 27 : ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. శనివారం జామినిలో ఇంటింటికీ ప్రచారం ప్రారంభించారు. తనదైన శైలిలో గోండి భాషలో మాట్లాడుతూ ప్రతి ఒక్కరిని పలకరించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్నెట్టి గోవర్ధన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాసం నర్సింగ్‌రావ్, మాజీ ఎంపీపీ లింగారెడ్డి, ఎంపీటీసీ ఫోరం మండలాధ్యక్షుడు పెందూర్ దేవన్న, మాజీ ఎంపీటీసీ రేణుకబాయి, నాయకులు పోచ్చన్న, గెడం జగన్నాథ్, పోతన్న పాల్గొన్నారు.

ఫ్లెక్సీ తొలగిస్తున్న అధికారులు, ఆందోళన చేస్తున్న నాయకులు

ఫ్లెక్సీ తొలగింపుపై బీజేపీ నేతల ఆందోళన

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 27 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలోని బోమవాడ వద్ద ప్రధాని మోదీతో కూడిన ఫ్లెక్సీని బీజేపీ ఏర్పాటు చేయగా ఫ్లెక్సీని శనివారం ఎంసీసీ అధికారులు తొలగించారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. అన్ని అనుమతులతో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తే అధికారులు కక్ష పూరితంగా తొలగించారని ఆరోపించారు. ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని, లేనట్లయితే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులతో మాట్లాడి ఆందోళన విరమింప జేశారు.

గులాబీ పండుగ

- కనుపపండువగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు
- పార్టీ జెండాను ఎగురవేసిన మాజీ మంత్రి జోగు రామన్న

బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తున్న మాజీ సర్పంచ్ గాడ్గె మీనాక్షి

ఆదిలాబాద్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు శనివారం ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా కనులపండువగా కొనసాగాయి. ఆదిలాబాద్ పట్టణంలోని కైలాస్‌నగర్‌లో బీఆర్ఎస్ జిల్లా కార్యాయంలో జరిగిన వేడుకల్లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు పాల్గొన్నారు. రామన్న గులాబీ జెండాను ఎగురవేశారు. జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో నిర్వహించిన ఆవిర్భావ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదిలాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో జోగు రామన్న మాట్లాడుతూ.. 2001లో ఆవిర్భవించిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు ఉద్యమంలో అండగా నిలిచారని, వారి సహకారంతో తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని తెలిపారు. పార్టీకి ప్రజలే హై కమాండ్ అని, ప్రజల సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ ముందుంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాలుగున్నర నెలల పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు, మహిళలు, ఉద్యోగులు, ఇతర వర్గాల ప్రజల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి సక్కు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, హక్కుల రక్షణలో కోసం బీఆర్ఎస్ పార్టీ ఏర్పడిందని, ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న తర్వాత కేసీఆర్ నాయకత్వంలో దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, యూనీస్ అక్బానీ, విజ్జిగిరి నారాయణ, దాసరి రమేశ్, అలాల అజయ్, ఆష్రఫ్, సాజీదొద్దీన్, గండ్రత్ రమేశ్, లింగారెడ్డి, రాంకుమార్, శ్రీనివాస్, శివకుమార్, మమత, ఫర్వీన్ సుల్తానా, రేఖ పాల్గొన్నారు.

ముక్రా(కే)లో..

ఇచ్చోడ, ఏప్రిల్ 27 : ముక్రా(కే) గ్రామంలో శనివారం బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పొలంలో మాజీ సర్పంచ్ గాడ్గె మీనాక్షి బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదేళ్లలో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దింది బీఆర్ఎస్సే అన్నారు. తెలంగాణలో మళ్లీ కేసీఆర్ సర్కార్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గాడ్గె సుభాష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో..

సోన్, ఏప్రిల్ 27 : నిర్మల్ మండలంలోని కొండాపూర్‌లో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ కే.విజయలక్ష్మి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కురుక్షేత్రంలో వంద మంది కౌరవులను ఓడించిది ఐదుగురు పాండవులే నని, నలుగురం ఉన్నమని అనుకోకుండా ఓడిపోయామని కుంగిపోకుండా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వమే కాబట్టి మంచి ఉత్సాహంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎసీఎస్ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షులు రాము, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు సుభాష్‌రావు, సోన్ జడ్పీటీసీ జీవన్‌రెడ్డి, మామడ బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు భూషన్‌రెడ్డి, చిన్నారెడ్డి, నజిరొద్దీన్, పడకంటి రమేశ్ రెడ్డి, గంగారెడ్డి, చారి, ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జెండాను ఎగురవేసిన మాజీ మంత్రి జోగు రామన్న, పక్కన ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తున్న నిర్మల్ జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, నాయకులు

నయా ఇసుక దందా

- అనధికారిక ఇసుక డంపులకు అధికారిక జరిమానాలు
- అభివృద్ధి పనుల పేరిట ఎసరు
- చక్రం తిప్పుతున్న అధికార పార్టీ నేత
- రోజు లక్షల రూపాయల లావాదేవీలు
- అధికారుల తీరుపైనా అనుమానాలు

ఖానాపూర్ మండలంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీ

అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్న ఫారెస్ట్ అధికారులు (ఫైల్)

నిర్మల్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, కడెం, పెంబి ప్రాంతాల్లోని వాగుల నుంచి వందలాది ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుకను ఓ మారుమూల ప్రదేశంలో డంపింగ్ చేస్తున్నారు. లోపాయికారి ఒప్పందంతో ఇసుక డంపు సమాచారాన్ని అధికారులకు అందించడం, అధికారులు ఆ ఇసుక డంపును సీజ్ చేయడం జరుగుతున్నది. ఇసుక తవ్వకాలు, తరలింపును పట్టించుకుని అధికారులు డంపుల వద్దకు మాత్రం ఆఘమేఘాల మీద చేరుకుని సీజ్ చేస్తుండడం అనుమానాలకు తావిస్తున్నది. అయితే ఇక్కడే ఇసుక మాఫియా తమ లోగుట్టును అమలు చేస్తున్నది. అభివృద్ధి పథకాలకు అవసరమయ్యే ఇసుక సేకరణ, తరలింపుకు ప్రభుత్వ పరంగా అనుమతులను జారీ చేసే అధికారం స్థానిక తహసీల్దార్లకు ఉండడం మాఫియాకు వరంగా మారింది. ఈ ఒక్క లొసుగును అనుకూలంగా మలుచుకుంటున్న కొంతమంది అధికార పార్టీ నాయకులు తాము అక్రమంగా ఏర్పాటు చేసుకున్న ఇసుక డంపులకు తహసీల్దార్లతో జరిమానాలు వేయించడం, ఆ ఇసుకకు అభివృద్ధి పథకాల పేరిట తరలింపునకు అనుమతులు తీసుకుంటున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఇసుకను అభివృద్ధి పనులకు కాకుండా, ప్రైవేటు నిర్మాణదారులకు అధికారికంగా అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రోజు లక్షల రూపాయల లావాదేవీలు సాగుతున్నట్లు చెబుతున్నారు. నాలుగు రోజుల క్రితం ఖానాపూర్ ప్రాంతంలో ఓ అధికార పార్టీ నేతకు సంబంధించిన ఇసుక డంపును అధికారులు సీజ్ చేయడం, ఆ తర్వాత ఆ ఇసుకకు అనుమతులు జారీ చేయడం ప్రస్తుతం జిల్లా అంతటా దుమారం రేపుతున్నది. దాదాపు 120 ట్రాక్టర్ల ఇసుకను ఈ అధికార పార్టీ నేత డంపుగా పేర్చే వరకు ఏ ఒక్క అధికారికి సమాచారం లేకపోవడం, కనీసం అనుమానం రాకపోవడం చర్చనీయాంశమవుతున్నది.


పట్టుకున్న లారీకి అనుమతులిస్తూ ఖానాపూర్ తహసీల్దార్ జారీ చేసిన లెటర్

మూడు నెలలుగా యథేచ్ఛగా..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇసుక దందాను పకడ్బందీగా కట్టడి చేసింది. తవ్వకాలు, తరలింపును అధికారులు అడ్డుకుని జరిమానాలు విధించడంతోపాటు కేసులు నమోదు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం అధికారం చేపట్టగానే సీన్ మారిపోయింది. అధికార పార్టీ చోటామోటా నాయకులంలు ఇసుకను పెద్ద మొత్తంలో తరలిస్తూ కాసుల పంట పండిస్తున్నారన్న ఆరోపణలు మొదలయ్యాయి. దీనికి పరాకాష్టగా ఖానాపూర్ ప్రాంతంలోని వాగులపై అధికార పార్టీకి చెందిన ఓ నేత కన్నేసి అక్కడి ఇసుకను అంతా కాజేస్తున్నారు. సదరు నేత అధికార దర్పంతో వందల ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను తరలించి మారుమూల ప్రాంతాల్లో డంపులు ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవలే ఈ నేత దాదాపు 120కి పైగా ట్రాక్టర్ల ద్వారా సేకరించిన ఇసుకకు జరిమానాలు విధింపజేసి ముథోల్ ప్రాంతంలో చేపడుతున్న అభివృద్ధి పనుల కోసం ఈ ఇసుకకు ఖానాపూర్ తహసీల్దార్ ద్వారా అనుమతులు తీసుకున్నట్లు తెలిసింది. అయితే ఈ వ్యవహారంపై కొంతమంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికార పార్టీ నేత తన పలుకుబడి పరపతితో సంబంధిత అధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ వ్యవహారాన్ని సద్దుమనిగింపజేశారంటున్నారు. కాగా.. ఇలా అక్రమ పద్ధతిలో అనుమతులను సంపాదించిన ఇసుకనంతా నిర్మల్ జిల్లాతోపాటు ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు తరలిస్తున్నారంటున్నారు. ఈ ప్రాంతాల్లో ఇసుకకు భారీగా డిమాండ్‌తో పాటు అధిక ధరలు ఉండటంతో అధికార పార్టీ నేతలు ఇసుక దందాను తమ ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారన్న విమర్శలున్నాయి. స్థానికంగా కొంతమంది అధికార పార్టీ నేతలు అక్రమ ఇసుక తరలింపును వృత్తిగా మార్చుకుంటున్నట్లు చెబుతున్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి..

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 27 : పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ జానకి షర్మిల పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలోని ఈవీఎం స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. అనంతరం గాజులపేట్ పంచశీల్ కళాశాలలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో గల ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ఆర్డీవో రత్న కల్యాణి పాల్గొన్నారు. అనంతరం భైంసా పట్టణంలోని శిశుమందిర్‌లో గల పోలింగ్ కేంద్రం 151ను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. అనంతరం భైంసా ఏఎస్పీ కార్యాలయంలో పోలీస్ అబ్జర్వర్ రాజేశ్ కుమార్ సక్సేనా, ఎన్నికల అధికారి, కలెక్టర్, ఎస్పీ, ఏఎస్పీ, రెవెన్యూ, అధికారులతో సమీక్షించారు. అనంతరం ముథోల్‌లోని ఈవీఎం స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి..

పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆయన ఎన్నికల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఆర్వో భుజంగ్ రావ్, ఆర్డీవో రత్నకల్యాణి, రవాణ శాఖ అధికారి దుర్గా ప్రసాద్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎస్పీ గంగారెడ్డి పాల్గొన్నారు.

సమీక్ష చేస్తున్న ప్రత్యేక పరిశీలకులు రాజేంద్రవిజయ్

స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ట్రాన్స్‌జెండర్‌లు

ట్రాన్స్‌జెండర్స్ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 27 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ట్రాన్స్‌జెండర్స్ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారిణి నాగమణి అన్నారు. మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖలు స్వీప్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్స్‌కు ఓటు హక్కు, వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికలతోపాటు ఇతర ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమం మనీషా ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు సమాచార స్లిప్‌ల పంపిణీ

మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, ఏప్రిల్ 27 : పోలింగ్ స్టేషన్‌లోని సంబంధిత బూత్ స్థాయి అధికారుల ద్వారా ఈ నెల 25 తేదీ నుంచి వచ్చే నెల 8 వరకు ఓటరు సమాచార స్లిప్‌లు పంపిణీ చేస్తారని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్ నుంచి ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా కింది అధికారులతో ఇన్‌చార్జిలుగా ఫిర్యాదు పర్యవేక్షణ సెల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఓటరు సమాచారం స్లిప్‌ల(వీఐఎస్) పంపిణీ సంబంధించి ఏవైన ఫిర్యాదులకు ఏర్పాటు చేసిన నంబర్లకు కాల్ చేయవచ్చని తెలిపారు.

రాస్తారోకో చేస్తున్న బోల్సా దళితులు

బోల్సా రహదారిపై రాస్తారోకో

తానూర్, ఏప్రిల్ 27 : బోల్సా గ్రామంలో శనివారం దళితులు రాస్తారోకో నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో గ్రామానికి చెందిన కొందరు గ్రామస్తులు అంబేద్కర్‌కు వ్యతిరేకంగా కొందరు నినాదాలు చేశారు. దీనిని నిరసిస్తూ రెండు గంటల పాటు రాస్తారోకో చేయగా, ఎస్ఐ సందీప్ ఘటన స్థలానికి చేరుకుని నచ్చ చెప్పడంతో విరమించారు. ఈ కార్యక్రమంలో భీమ్‌రావ్, అరవింద్, సంతోష్, ప్రశాంత్, సుదర్శన్ పాల్గొన్నారు.